# సాక్షి కాకినాడ

సోమవారం । 2 । డిసెంబర్ । 2024






## రూ.50 వేల విరాళం


గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెం గంగాభవానీనగర్‌లో నిర్మిస్తున్న కనకదుర్గమ్మ ఆలయానికి గ్రామానికి చెందిన కడవల సూర్యావతి రూ.50 వేలు విరాళం ఇచ్చారు.



## పొగాకు సాగుకు పదపద

పొగాకు సాగు విస్తీర్ణం పెరుగుతోంది.. తూర్పు గోదావరి జిల్లాలో ప్రధాన వాణిజ్య పంటగా పండిస్తున్న వర్జీనియా పొగాకు నాట్ల ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. 8లో

## కడలిలోకి 17,382 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం 17,382 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. గోదావరి డెల్టా కాలువలకు 5,100 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

## న్యూస్‌రీల్

### వనదుర్గమ్మకు ఘనంగా ప్రత్యంగిర హోమం



హోమంలో పాల్గొన్న భక్తులతో నిండిపోయిన మండపం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి కార్తిక అమావాస్య సందర్భంగా ఆదివారం ప్రత్యంగిర హోమం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం తొమ్మిది గంటలకు పండితులు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ప్రత్యంగిర హోమం ప్రారంభించారు. హోమం అనంతరం 11 గంటలకు హోమగుండంలో ద్రవ్యాలను సమర్పించి ఘనంగా పూర్ణాహుతి నిర్వహించారు. తరువాత అమ్మవారికి వేద పండితులు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి నైవేద్యం చెల్లించారు. వేద పండితులు యనమండ్ర శర్మ, గంగాధరబట్ల గంగబాబు, అర్చకులు దత్తాత్రేయశర్మ, కోట వంశీ, పరిచారకుడు వేణు వ్రత పురోహితులు కూచుమంచి ప్రసాద్, దేవులపల్లి ప్రకాష్ హోమం నిర్వహించారు.

**భక్తులతో నిండిపోయిన హోమ మండపం**

అమావాస్య ఆదివారం అరుదుగా వచ్చే పర్వదినం కావడంతో సుమారు 60 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి ప్రత్యంగిర హోమంలో పాల్గొన్నారు. దీంతో హోమ మండపం భక్తులతో నిండిపోయింది. దీంతో కొంతమంది భక్తులు వెలుపల నిలబడాల్సి వచ్చింది.

### ఒప్పందం అమలుకు కమిటీ

ఎస్ఎస్ఏ జేఏసీ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

కాకినాడ సిటీ: జనవరిలో సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీకి ప్రభుత్వంతో జరిగిన సమ్మె ఒప్పందం అమలుకు కమిటీ ఏర్పాటు చేయాలని జేఏసీ రాష్ట్ర చైర్మన్ కాంతారావు, జేఏసీ అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. జీవోలు, సర్క్యులర్లు, హెచ్ఆర్ పాలసీ, మినిమం టైమ్ స్కేల్ అమలు కోరుతూ కాకినాడ టీచర్స్ హోమ్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వంతో ఒప్పందం జరిగి 11 నెలలు గడిచాయని, అనేక అంశాలపై ఉత్తర్వులు విడుదల కావాల్సి ఉందన్నారు. ఈలోపు నిత్యావసరాల ధరలు, కరెంటు బిల్లులు, ఇంటి అద్దెలు విపరీతంగా పెరిగి కుటుంబాలను పోషించుకోవడం భారంగా మారిందన్నారు. మరోవైపు టార్గెట్లు పెట్టి మహిళా ఉద్యోగులని కూడా చూడకుండా రాత్రి వరకు పని చేయిస్తూ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగులను బానిసలకంటే దారుణంగా ట్రీట్ చేస్తూ వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నిచోట్ల ఎస్ఎస్ఏ ఉద్యోగులపై భౌతికదాడులు చేస్తున్నా, బాధితులనే బాధ్యులను చేస్తూ అన్యాయం చేస్తున్నారని వివరించారు. సమ్మె ఒప్పందం మేరకు అన్ని రకాల ఆదేశాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, జిల్లా జేఏసీ ప్రధాన కార్యదర్శి నాగమణి, కోశాధికారి పి.రాజు, ఐఈఆర్‌టీ జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్, నాగార్జున, సీఆర్‌పి రాష్ట్ర నాయకుడు రామ్ జీ, జిల్లా అధ్యక్షులు టి మీరా సాహెబ్ పాల్గొన్నారు.

# చలి పులి పంజా

- తీవ్రమవుతున్న శీతల గాలులు
- పొంచి ఉన్న వ్యాధుల ముప్పు
- వారం రోజులుగా 18 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న రగ్గులు, స్వెటర్లు

కాకినాడ సిటీ: జిల్లాలో రోజురోజుకు చలి తీవ్రత పెరుగుతోంది. ఉదయం 7 గంటల వరకు పొగ మంచు వదలడం లేదు. సాయంత్రం ఐదున్నర గంటల నుంచే శీతల గాలులు వీస్తున్నాయి. ఆరు గంటల నుంచి చలి ప్రభావం ఉంటోంది. వారం రోజుల నుంచి 20 కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ప్రజలు రాత్రి, తెల్లవారు జామున బయటకు రాలేకపోతున్నారు. తక్కువ ఉష్ణోగ్రతలు, శీతల గాలుల వల్ల వ్యాధులు ప్రబలుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఉదయం పొలం పనులకు వెళ్లే రైతు కూలీలు, వేటకు వెళ్లే మత్స్యకారులు, ఇతర పనులకు వెళ్లే కార్మికులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఉదయం పూట వ్యాయామానికి వెళ్లే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు.

**పడిపోతున్న ఉష్ణోగ్రతలు**

ఈ ఏడాది వర్షాలు అధికంగా కురవడంతో నేలలో తేమ అధికంగా ఉంది. జలవనరులు పుష్కలంగా ఉండటంతో చలి తీవ్రత అధికంగా ఉంటోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో చలి ప్రభావం సాయంత్రం నుంచే కనిపిస్తోంది. ముఖ్యంగా వరి పొలాలు, నీటి ఆధారిత పంటలు సాగు చేస్తున్న పొలాలపై నుంచి వచ్చే తేమ గాలులకు మరింతగా చలి ఉంటోంది. గతేడాది చలి తీవ్రత అంతగా కనిపించలేదు. 21 నుంచి 24 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అయితే ఈ ఏడాది నవంబర్ 10వ తేదీ నుంచే చలి గాలులు మొదలయ్యాయి. గడచిన వారం రోజుల నుంచి తీవ్రత పెరిగింది. కనిష్ట ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. 16 నుంచి 19 డిగ్రీల నడుమ నమోదయ్యాయి. ఇక పొగ మంచు తీవ్రత అధికంగా ఉంది. సాయంత్రం ఆరున్నర గంటల నుంచే గ్రామాలను మంచు కమ్మేస్తోంది. నడిరాత్రి సమయానికి తీవ్రంగా మారుతోంది. ఇక తెల్లవారే సమయంలో అత్యధికంగా ఉంటోంది. ఉదయం ఏడున్నర గంటలు దాటినా వదలడం లేదు.

**ఆస్తమా ఉందా.. జాగ్రత్త**

ఆస్తమా ఉన్న వారు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. కోడిగుడ్లు, పాల ఉత్పత్తులు, చేపలు వంటి ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోరాదు. కూల్ డ్రింక్స్, ఉప్పు అధికంగా ఉన్న పదార్థాలు, ఫాస్ట్ ఫుడ్ తీసుకోరాదు. యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉన్న పదార్థాలు తీసుకోవాలి.

**ఫ్రిజ్‌లో ఆహారం తినొద్దు**

చలికాలంలో మనం తీసుకునే ఆహారం పట్ల జాగ్రత్తలు వహించాలి. ఫ్రిజ్‌లో ఉండే ఐటెమ్స్ అసలు తినరాదు. కేవలం వేడి ఆహార పదార్థాలను మాత్రమే తినాలి. చలికాలంలో మద్యంతో పాటు టీ, కాఫీలను అధికంగా తాగుతారు కొందరు. ఇలా అసలు చేయరాదు. మద్యానికి దూరంగా ఉండాలి. టీ, కాఫీ రోజుకు రెండు మూడు కప్పులు మాత్రమే తీసుకోవచ్చు. దీంతో శరీరం ఎప్పుడూ వెచ్చగా ఉంటుంది. తగనంత నీటిని తీసుకుంటే ద్రవాలు అంది జీవక్రియలు సరిగ్గా ఉంటాయి. చలికాలంలో జ్వరం, దగ్గు, జలుబు వంటివి మూడు రోజులకు మించి వేధిస్తుంటే వెంటనే వైద్యుణ్ణి సంప్రదించాలి.

**గుండెకు చలి తిప్పలు**

తరచూ వాతావరణంలో వచ్చే మార్పులు శరీరంపై రకరకాల ప్రభావాన్ని చూపిస్తాయి. చలికాలంలో హార్ట్ పేషెంట్లు జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ కాలంలో అడ్రినలిన్, నారిటలిన్ వంటి హార్మోన్ల లెవెల్స్‌లో మార్పులొస్తాయి. ఇవి రక్త ప్రసరణలో మార్పులు తెస్తాయి. చలికాలం రక్తనాళాలు సహజంగా ముడుచుకునే స్వభావాన్ని కలిగి ఉంటాయి. ఇలాంటప్పుడు కొలెస్ట్రాల్ వంటి సమస్యలు పెరిగే ప్రమాదముంది. కాబట్టి చలి కాలం గుండె సమస్యలున్నవాళ్లు వేడిగా ఉన్న ఆహారాన్నే తీసుకోవాలి. తేలికపాటి వ్యాయామాలు చేస్తుండటం ద్వారా రక్త ప్రసరణ సక్రమంగా జరిగేలా చూసుకోవచ్చు.

**రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటే**

రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు అత్యవసరమైన పని ఉంటే తప్ప బయటకు వెళ్లరాదు. ఇంటి లోపలి ప్రదేశాలు కూడా వెచ్చగా ఉండేలా చూసుకోవాలి. కిటికీలు, తలుపులు కచ్చితంగా మూసివేయాలి. పండ్లు, కాయగూరలు, నట్స్ ఎక్కువగా తీసుకోవాలి. ఇన్ఫెక్షన్లు , ఆస్తమా రాకుండా కాచి చల్లార్చిన నీటిని తాగాలి. ఆస్తమా, నిమోనియా వంటి శ్వాసకోశ సమస్యలుంటే జాగ్రత్తగా ఉండాలి. కూల్ డ్రింక్స్, ఐస్‌క్రీమ్స్, ఐస్ వాటర్‌కు దూరంగా ఉంటే మంచిది. ఏసీ గదుల్లో ఎక్కువ సమయం గడపకుండా ఉండడం శ్రేయస్కరం.

**జాగ్రత్తలు ఇలా**

- చిన్న పిల్లల్లో చెవిపోటు, గొంతు నొప్పి, జలుబు, వచ్చే అవకాశం ఉన్నందున సూర్యరశ్మి వచ్చాకే బయటకు పంపించాలి.
- ఆస్తమా వ్యాధిగ్రస్తులు ఇన్‌హేలర్ వాడడానికి బదులు ఉదయం సాయంత్రం వేళల్లో వేడి నీటి ఆవిరి పట్టడం మంచింది.
- చర్మం పొడిబారిపోకుండా ఔషధ పూరితమైన లేపనాలు వాడాలి.
- రసాయనాలతో కూడిన సబ్బులకు బదులు మైల్డ్ సోప్స్ వాడటం మంచిది.
- గోరు వెచ్చని నీటితో స్నానం చేయడం ఆరోగ్యకరం
- చలి గాలుల కారణంగా చర్మ సంబంధిత, ఆస్తమా, గుండె జబ్బులు, చెవి, ముక్కు, గొంతు నొప్పులు వచ్చే ప్రమాదం ఉంది.

గత వారం రోజుల్లో నమోదైన కనిష్ట ఉష్ణోగ్రతలు

| తేదీ | కనిష్ట ఉష్ణోగ్రత | గతేడాది ఉష్ణోగ్రత |
|---|---|---|
| 25 | 16 | 21 |
| 26 | 18 | 22 |
| 27 | 17 | 24 |
| 28 | 17 | 22 |
| 29 | 16 | 21 |
| 30 | 16 | 21 |
| 1 | 16 | 23 |

**వ్యాయామం తప్పనిసరి**

చలికాలంలో చలి దెబ్బకు వ్యాయామానికి స్వస్తి చెప్పి దుప్పట్లో దూరిపోతారు. మరి కొందరు చలిలో కూడా వ్యాయామం చేస్తారు. కానీ ఈ సీజన్‌లో జాగ్రత్తలతో కూడిన వ్యాయామం చేయడం తప్పనిసరి అని నిపుణులు చెబుతున్నారు. కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయాలంటున్నారు.

- రోజు మూడు నుంచి 9 గ్లాసులు నీటిని తాగడం అలవాటు చేసుకోవాలి.
- బీపీ, సుగర్ ఉన్నవారు క్రమం తప్పకుండా వైద్యుల సూచనల మేరకు మందులు తీసుకోవాలి.
- ఆస్తమా శ్వాసకు సంబంధించిన సమస్యలున్నవారు మంచులో నడిచే సమయంలో జాగ్రత్తలు పాటించాలి.
- అలర్జీలు ఉన్న వారు చలి సమయంలో బయటకు రాకపోవడమే ఉత్తమం.
- జామ, బొప్పాయి, అరటి, దానిమ్మ పండ్లు మంచివి.
- పిల్లలను చీకటి పడే వరకు బహిరంగ స్థలాల్లో ఆడించకపోవడమే మంచిది. కాచి చల్లార్చిన నీటిని అందివ్వాలి.

**జాగ్రత్తలు పాటించాలి**



చలికాలంలో పిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు అధికం. ప్రధానంగా ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు పాటించాలి. రోజులో ఉదయం సాయంత్రం 30 నిమిషాల పాటు సూర్యకాంతి పడేలా చూసుకోవాలి. విటమిన్–డి, సి అధికంగా ఉండే పదార్థాలు తీసుకోవాలి. చెవిలోకి చల్లగాలి వెళ్లకుండా చూసుకోవాలి. జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాలు ఉంటే వెంటనే ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవాలి.

– డాక్టర్ ఐ ప్రభాకర్, ఆర్‌బీఎస్‌కె జిల్లా ప్రాజెక్టు ఆఫీసర్, కాకినాడ

## ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు భరోసా ఇవ్వాలి

కలెక్టర్ షణ్మోహన్




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు మంచి మార్గాన్ని ఎన్నుకోవడంతో పాటు మన ఆరోగ్యం.. మన హక్కు అనే విధంగా జీవించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం కలెక్టరేట్ వివేకానంద సమావేశపు హాలులో ఎయిడ్స్ బాధిత బాల బాలికలతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు భరోసానివ్వడం ద్వారా వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపవచ్చన్నారు. అపోహలు, ఊహాగానాలకు తావులేకుండా క్రమం తప్పకుండా మందులు వేసుకొని, పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆయుర్దాయం పెరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఎయిడ్స్ వ్యాధి బారిన పడిన విద్యార్థులతో కలిసి కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ఏర్పాటు చేసిన సహపంక్తి భోజనం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్, జేసీ రాహుల్ మీనా, ఇతర అధికారులు పాల్గొని బాలలతో కలిసి భోజనం చేశారు.

**వైద్య ఆరోగ్యశాఖ ర్యాలీ**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి పీఆర్ కళాశాల మీదుగా బాలాజీ చెరువు సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఎం అండ్‌హెచ్ఓ డాక్టర్ నరసింహనాయక్ మాట్లాడుతూ ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఎయిడ్స్ అనేది అవగాహనతోనే అంతమవుతుందన్నారు. ర్యాలీలో రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ వైడీ రామారావు, సెట్రాజ్ సీఈవో కాశీ విశ్వేశ్వరరావు, వివిధ నర్సింగ్ కళాశాల విద్యార్థులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాలు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సభ్యులు పాల్గొన్నారు. కాకినాడ జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన ఉద్యోగస్తులకు, వివిధ స్వచ్ఛంద సంస్థలకు కలెక్టర్, జేసీ జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణాధికారి డాక్టర్ రమేష్, డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎన్ స్వప్న, జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ విఠల్‌రావు, ఓఎన్‌జీసీ సంస్థ జీఎం సునీల్ కుమార్, రిలయన్స్ సంస్థ డీజీఎం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## వైభవంగా కోటి దీపోత్సవం



సామర్లకోట పంచారామ క్షేత్రంలో కోటి దీపోత్సవం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా కోటి దీపోత్సవం జరిగింది. కార్తిక మాసం ముగింపు రోజున అమావాస్యను పురస్కరించుకొని ప్రతీ ఏడాది పంచారామ క్షేత్రంలో కోటి దీపోత్సవం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా రాత్రి పంచారామ క్షేత్రంలోని ఉప ఆలయమైన గణపతి ఆలయంలో ఈఓ బళ్ల నీలకంఠం, ఉత్సవాల ప్రత్యేకాధికారి కేవీ సూర్యనారాయణ, ఉత్సవ కమిటీ చైర్మన్ కంటే బాబులు పూజలు చేసి దీపాలు వెలిగించి దీపోత్సవాన్ని ప్రారంభించారు. ఆలయ దీపారాధన సంఘ సభ్యులు ఆలయం అంతా దీపాలతో నింపారు. భక్తులు దీపాల వద్ద వేచి ఉండి ఆలయ దీపారాధన సంఘ సభ్యులు ఆరు గంటలకు గంట మోగించిన వెంటనే భక్తులు ఒకేసారి హర హర మహాదేవ శంభోశంకరా అంటూ దీపాలను వెలిగించారు. ఆలయంలోని మొదటి అంతస్తు, దిగువ భాగంలోని స్తంభాలు, ఆలయ గోడల చుట్టూ దీపాలను ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలోను భక్తులు దీపాలు వెలిగించడంతో అడుగు తీసి అడుగు వేయడానికి వీలు లేని విధంగా ఆలయం దీపాలు, భక్తులతో నిండిపోయింది. భక్తులు 365 ఒత్తుల నుంచి 1000 ఒత్తుల వరకు దీపాలు ఏర్పాటు చేసుకొని వెలిగించారు. ఆలయం అంతా దీపారాధన సంఘ సభ్యులు దీపాలు ఏర్పాటు చేశారు. సీఐ ఎ కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

## రైతులు పంట నష్టాన్ని నివారించుకోవాలి



ఎస్ విజయ్‌కుమార్, వ్యవసాయ శాఖ జేడీ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ప్రస్తుతం జిల్లాలోని తుపాను హెచ్చరికల నేపథ్యంలో వరి రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయశాఖ జేడీ ఎస్.విజయ్‌కుమార్ రైతులను కోరారు. రైతులకు ఆదివారం ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

- కోతకి సిద్ధంగా ఉన్న వరి పంట కోయకూడదు.
- వరిపంట కోసి పూర్తిగా ఆరని పనలకు తుపాను నేపథ్యంలో కుప్ప వేసేటప్పుడు ఎకరాకు 25 కేజీల ఉప్పును పనలపై చల్లుకుంటూ కుప్ప వేసుకోవడం వల్ల నష్టాన్ని నివారించుకోవచ్చు.
- కోత కోసి పొలాల్లో ఉన్న పనలు వర్షానికి తడిస్తే గింజ మొలకెత్తకుండా ఉండడానికి 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పడే విధంగా పిచికారీ చేయాలి. ఒక వేళ పొలంలో నీరు నిలిచిఉంటే పనలను గట్లపైకి తెచ్చుకొని విడగొట్టి ఉప్పు ద్రావణం చల్లుకోవాలి. వర్షాలు తగ్గి ఎండలు రాగానే పనలు తిరగేసి ఎండ బెట్టి నూర్చుకోవాలి.
- కళ్లాల మీద ఉన్న ధాన్యాన్ని వర్షానికి తడవకుండా భద్రపరుచుకోవాలి.
- నూర్చిన ధాన్యం రెండు మూడు రోజులు ఎండ బెట్టడానికి వీలు కాకపోతే గింజ మొలకెత్తడమే కాకుండా రంగుమారి చెడు వాసన వస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో నష్టాన్ని నివారించడానికి ఒక క్వింటాల్ ధాన్యానికి ఒక కిలో ఉప్పు, 20 కిలోల పొడి ఊక కలిపి ధాన్యం పోగు పెట్టడం వల్ల గింజ మొలకెత్తకుండా, చెడిపోకుండా ఉంటుంది.
- రంగు మారి, తడిసిన ధాన్యం పచ్చి బియ్యం కంటే ఉప్పుడు బియ్యంగా అమ్ముకోవడం వల్ల నష్టాన్ని కొంత వరకూ తగ్గించుకోవచ్చు.
- పగులు పొట్ట , పూత దశలో ఉన్న వరి పైరు 1 నుంచి 2 రెండు రోజులు కన్నా ఎక్కువ రోజులు నీట మునిగితే కంకి పూర్తిగా బయటకు రాకపోవడం, పుష్పాల్లో నీరు చేరడం వల్ల ఫలదీకరణ శక్తి కోల్పోయి తాలు, రంగు మారిన గింజలు ఏర్పడతాయి. గింజ రంగు మారకుండా ఉండడానికి లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం లేదా రెండు గ్రాముల కార్బెండిజం, మాంకోజెబ్ మందు పిచికారీ చేసుకోవాలి.
- పాలు పోసుకొనే దశలో ఉన్న పంట మునిగితే పిండి పదార్థాలు గింజల్లో చేరి గింజ బరువు తగ్గి రంగు మారడంతో దిగుబడి , నాణ్యత తగ్గుతాయి. గింజ రంగు మారకుండా లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం, ప్రొపికొనజోల్ మందు పిచికారీ చేసుకోవాలి.
- గింజ తోడుకునే , గట్టిపడే దశలో ఉన్న వరిపైరు బరువు వల్ల కొద్దిపాటి గాలి, వర్షాలకే ఒరిగిపోయి నేల నంటుందన్నారు. ఈ విధంగా పడిపోవడం వల్ల పిండి పదార్థం గింజలకు సరిగా చేరక గింజ బరువు తగ్గడం , తాలు గింజలు ఏర్పడడంతో దిగుబడి తగ్గే అవకాశం ఉంది. వీలైనంత త్వరగా దుబ్బులను లేపి నిలబెట్టి కట్టలుగా కట్టే చర్యలు తీసుకోవాలి.

## దళితులనే బలి పశువులను చేస్తున్నారు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరావు

తుని: అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలు దళితులనే బలిపశువులు చేస్తున్నాయని రాష్ట్ర మాల మహాసభ అధ్యక్షుడు మల్లెల వెంకటరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానికంగా ఉన్న హోటల్లో దళిత ప్రతినిధులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. దళితులను విభజించి పాలిస్తున్న రాజకీయ పార్టీలను రాజ్యాంగ స్ఫూర్తితో ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్న ఎస్సీ వర్గీకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో డీఎస్సీతో సహా వివిధ జాబ్ నోటిఫికేషన్లు విడుదల చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. సోషల్ మీడియా కేసుల విషయంలో ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం అనుసరిస్తున్న తీరును ఆయన తప్పుబట్టారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్ని వర్గాల ప్రజల ఓట్లతో గద్దెనెక్కి నేడు సనాతన ధర్మ రక్షకుడినంటూ రోడ్డెక్కి రచ్చ చేయడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. దళిత, క్రైస్తవ, మైనార్టీలపై పవన్ కల్యాణ్ అభిప్రాయం తెలియజేయాలని డిమాండ్ చేశారు. దళిత సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు, దండేల కృష్ణారావు, బోడపాటి సతీష్, పెదపాటి మేగరంజన్, ఇంజరపు నరసింహమూర్తి, గారా చంటి, బొల్ల రాజు, కాలా మహర్, బర్రె మధు, బోడపాటి శ్రీను పాల్గొన్నారు.

## ఘనంగా మహాకుంభాభిషేకం



అభిషేకం చేస్తున్న భక్తులు

కాకినాడ రూరల్: సాగర తీరన శివ భక్తుని సంకల్పంతో కళాబంధు డాక్టరు టి.సుబ్బిరామిరెడ్డి నిర్మించిన శ్రీమంగళాంబిక సమేత శ్రీఆదికుంభేశ్వరస్వామి ఆలయంలో 49వ మహాకుంభాభిషేకం ఆదివారం ఘనంగా జరిగింది. ఒక కోటి ఎనిమిది లక్షల శివ లింగాలతో పాద రస లింగానికి మహా కుంభాభిషేకంలో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు.

## మిగిలింది నాలుగు రోజులే..

- ఇంటర్ పరీక్ష ఫీజుకు సమీపిస్తున్న తుది గడువు
- అపరాధ రుసుం లేకుండా ఈ నెల 5 తేదీ ఆఖరు



ఇంటర్ విద్యార్థులు

రాయవరం: వచ్చే విద్యా సంవత్సరంలో నిర్వహించనున్న పదో తరగతి, ఇంటర్ పరీక్షలకు పరీక్ష ఫీజు చెల్లింపునకు సంబంధించిన షెడ్యూల్స్ విడుదలయ్యాయి. అపరాధ రుసుం లేకుండా పదో తరగతి పరీక్ష ఫీజు తుది గడువు ఇప్పటికే ముగియగా, ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపునకు అపరాధ రుసుం లేకుండా ఈ నెల 5వ తేదీ వరకూ కట్టొచ్చు. 2024 మార్చిలో జరగనున్న ఇంటర్ పరీక్షలకు పరీక్ష ఫీజుల షెడ్యూల్‌ను అక్టోబర్ 17న ఇంటర్ బోర్డు సెక్రటరీ కృత్తికా శుక్లా విడుదల చేశారు. అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఇంటర్ బోర్డు నవంబరు 11వ తేదీ వరకూ తొలుత గడువు విధించింది. తర్వాత రెండో సారి నవంబర్ 21వ తేదీ వరకూ గడువు పొడిగించింది. మూడో సారి ఈ నెల 5వ తేదీ వరకూ గడువు విధిస్తూ ఇంటర్ బోర్డు అవకాశాన్ని కల్పించింది. దీనికి మరో నాలుగు రోజులు మాత్రమే గడువు ఉండడంతో విద్యార్థులు అప్రమత్తం కావాలని ఇంటర్ బోర్డు అధికారులు సూచిస్తున్నారు. నిర్ణీత గడువు దాటిన తర్వాత జాప్యమయ్యే కొద్దీ అపరాధ రుసుం మోత మోగనుంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఎంత వీలైతే అంత త్వరగా పరీక్ష ఫీజును చెల్లిస్తే మంచిదన్న అభిప్రాయం జూనియర్ కళాశాలల వర్గాల్లో వ్యక్తమవుతోంది.

**ఫీజుల చెల్లింపు ఇలా..**

ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ జనరల్/ ఒకేషనల్ విద్యార్థులు థియరీ పరీక్ష నిమిత్తం రూ.600 చెల్లించాల్సి ఉంది. జనరల్ కోర్సులు చదివే సైన్స్ విద్యార్థులు ప్రాక్టికల్స్ (సెకండియర్ విద్యార్థులు మాత్రం ) రూ.275 చెల్లించాలి. ఒకేషనల్ కోర్సు చదువుతూ బ్రిడ్జి కోర్సు చేసే విద్యార్థులు బ్రిడ్జి కోర్సు సబ్జెక్టులకు పరీక్ష రుసుంగా రూ.165 కట్టాలి. సెకండియర్ చదువుతూ ఫస్టియర్ సబ్జెక్టులు ఫెయిలైన విద్యార్థులు మొదటి, రెండో సంవత్సరాల థియరీ ఫీజు కలిపి రూ.1,200 చెల్లించాలి. ఒకేషనల్ కోర్సు చదువుతూ ఫస్టియర్, సెకండియర్ ప్రాక్టికల్స్ రాసే విద్యార్థులు రెండేళ్లకు కలిపి రూ.550 కట్టాలి. బ్రిడ్జి కోర్సు చదివే విద్యార్థులు రెండేళ్ల పరీక్షలకు రూ.330 చెల్లించాలి. ఫస్టియర్, సెకండియర్ పాసై ఉండి, మార్కులు ఇంప్రూవ్‌మెంట్‌కు పరీక్ష రాసే ఆర్ట్స్ విద్యార్థులు రూ.1,350 చొప్పున, సైన్స్ విద్యార్థులు రూ.1,600 చొప్పున చెల్లించాలి.

**కాకినాడ జిల్లాలో..**

జిల్లాలో 45,323 మంది ఇంటర్ విద్యార్థులు వచ్చే ఏడాది మార్చిలో జరిగే పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్నారు. ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు 23,568 మంది ఉండగా, ఇప్పటి వరకూ 22,584 మంది పరీక్ష ఫీజు చెల్లించారు. సెకండియర్ విద్యార్థులు 21,755 మందికి 19,208 మంది ఫీజు చెల్లించారు. జిల్లాలో ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులు మొత్తం 3,531 మంది పరీక్ష ఫీజు కట్టాల్సి ఉంది.

**విద్యార్థులను అప్రమత్తం చేయాలి**



ఇప్పటి వరకూ ఇంకా ఫీజు చెల్లించని విద్యార్థులు నిర్ణీత గడువులోగా పరీక్ష ఫీజు చెల్లించేందుకు ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు విద్యార్థులను అప్రమత్తం చేయాలని ఆదేశాలు జారీ చేశాం. నిర్ణీత గడువులోగా పరీక్ష ఫీజు చెల్లించకుంటే ఫైన్‌తో చెల్లించడం విద్యార్థులకు ఆర్థికంగా భారంగా మారుతుంది. నూరు శాతం విద్యార్థులు ఫైన్ లేకుండా పరీక్ష ఫీజు చెల్లించే విధంగా కళాశాలల ప్రిన్సిపాల్స్ చర్యలు తీసుకోవాలి.

–ఎస్ఎస్‌వీఎల్ నరసింహం, ఆర్‌ఐఓ, ఇంటర్ బోర్డు, రాజమహేంద్రవరం

## నేడు విభిన్న ప్రతిభావంతుల క్రీడాపోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): డిసెంబరు 3 అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో డీఎస్ఏ మైదానంలో సోమవారం విభిన్న ప్రతిభావంతులకు జిల్లాస్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్‌కుమార్ ఆదివారం తెలిపారు. పురుషులు, మహిళలకు అథ్లెటిక్స్‌లో 100 మీటర్ల పరుగు, షాట్‌పుట్, చెస్, పురుషులకు వాలీబాల్, మహిళలకు త్రోబాల్ పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి గలవారు ఉదయం 8 గంటలకు కాకినాడలోని డీఎస్ఏ క్రీడా మైదానంలో హాజరుకావాలని కోరారు.

## యథావిధిగా పీజీఆర్ఎస్

కాకినాడ సిటీ: ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో నిర్వహిస్తామని కలెక్టర్ షణ్మోహన్ ఆదివారం తెలిపారు. మండల స్థాయిలో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు అందరూ ఉదయం 9.30 గంటలకు ఆయా మండలాల్లో తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు.

## క్లుప్తంగా

### యువతి అదృశ్యం

గండేపల్లి: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు గండేపల్లి ఎస్సై యూవీ శివనాగబాబు ఆదివారం తెలిపారు. ఆ వివరాల్లోకి వెళితే.. మండలంలోని యల్లమిల్లికి చెందిన యువతి నవంబర్ 30న కిరాణా సామాన్ల కోసం ఇంటి నుంచి దగ్గర్లో గల దుకాణానికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఆమె కోసం వెతికినా ఆచూకీ లేకపోవడంతో యువతి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై పేర్కొన్నారు.

### 35 టన్నుల రేషన్ బియ్యం సీజ్

కరప: నడకుదురులోని ఒక ప్రైవేట్ గోదాములో ఆగి ఉన్న లారీలో రేషన్ బియ్యాన్ని గుర్తించి సీజ్ చేసినట్టు కరప ఎస్సై టి.సునీత ఆదివారం రాత్రి తెలిపారు. గత నెల 27న సివిల్ సప్లయిస్, రెవెన్యూ అధికారులు, పోలీసులు సంయుక్తంగా నడకుదురులోని ఒక రైస్‌మిల్లు గోదాము వద్ద తనిఖీలు నిర్వహించారు. ఆ గ్రామంలోని లావణ్ ఇంటర్నేషనల్ ప్లాంట్ వద్ద ఆగి ఉన్న ఏడు లారీల్లో బియ్యం శాంపిల్స్ తీసుకుని ల్యాబ్‌కు పంపించారు. సదరు లారీల్లో ఒక లారీలో ఉన్న 35 మెట్రిక్ టన్నుల బియ్యం పేదలకు పంపిణీ చేసే రేషన్ బియ్యంగా గుర్తించారు. ఆ లారీ తెలంగాణ రాష్ట్రం సిద్దిపేటకు చెందిన మణికంఠ ట్రేడర్స్ నుంచి వచ్చినట్టు ఎస్ఐ తెలిపారు. లారీతో పాటు బియ్యం విలువ రూ.37,25,000 ఉంటుందన్నారు. ఈ మేరకు కరప ఎస్ఐ టి.సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### ఉచిత శిక్షణకు 13 మంది ఎంపిక

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో బీసీ స్టడీ సర్కిల్‌లో గత నెల 27న నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్షల్లో ఉమ్మడి తూర్పు పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో 13 మంది అభ్యర్థులు అర్హత సాధించారని బీసీ సర్కిల్ సంచాలకులు కేఎస్ జ్యోతి ఆదివారం తెలిపారు. సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్‌కు ప్రవేశ పరీక్షకు ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి మొత్తం 75 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో 70 మంది పరీక్షలు రాశారన్నారు. వారిలో 13 మంది ఉచిత శిక్షణకు అర్హత సాధించారన్నారు. అభ్యర్థులకు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గొల్లపూడి కేంద్రంలో ఆరు నెలల పాటు యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ఉచిత వసతి, ఉపకార వేతనంతో కూడిన శిక్షణ అందించనున్నామన్నారు.

# పొగాకు సాగుకు పదపద

- చివరి దశకు వర్జీనియా పొగాకు నాట్లు
- 18,149 హెక్టార్లలో సాగు
- గణనీయంగా పెరిగిన విస్తీర్ణం

దేవరపల్లి: పొగాకు సాగు విస్తీర్ణం పెరుగుతోంది.. తూర్పు గోదావరి జిల్లాలో ప్రధాన వాణిజ్య పంటగా పండిస్తున్న వర్జీనియా పొగాకు నాట్ల ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. 2024–25 పంట కాలానికి బోర్డు అధికారులు బ్యారన్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేయడంతో రైతులు పంట సాగుకు శ్రీకారం చుట్టారు. అక్టోబర్ చివరి వారం నుంచి నాట్లు వేస్తున్నారు. అధిక దిగుబడులు వచ్చే 1,353, ఎల్‌వీ–7, ఏ–3 వంటి వంగడాలను సాగు చేస్తున్నారు. అన్నీ అనుకూలిస్తే ఈ వంగడాలు ఎకరాకు 12 క్వింటాళ్ల నుంచి 14 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు అంటున్నారు. గత ఏడాది డిసెంబర్‌లో మిచాంగ్ తుపాను కారణంగా వేసిన తోటలు దెబ్బతినడంతో దిగుబడులు తగ్గాయి. ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అయితే అప్పట్లో మార్కెట్‌లో పొగాకుకు డిమాండ్ ఏర్పడి ఊహించని ధర లభించడంతో రైతులకు లాభాలు వచ్చాయి. 48 మిలియన్ల కిలోల ఉత్పత్తికి అనుమతి ఇవ్వగా, 65 మిలియన్ల కిలోల పంట ఉత్పత్తి జరిగింది. సాగు విస్తీర్ణం అనుమతించిన దానికంటే 20 వేల ఎకరాల్లో అదనంగా పండించారు. అంతర్జాతీయ మార్కెట్లో అవసరాలకు సరిపడగా పొగాకు పంట లేక మన దేశ పొగాకుకు డిమాండ్ ఏర్పడి మంచి ధర పలికింది. ఈ ఏడాది బ్యారన్‌కు 41.25 క్వింటాళ్ల చొప్పున ఎస్ఎల్ఎస్ ప్రాంతంలోని ఐదు వేలం కేంద్రాల పరిధిలో 58.75 మిలియన్ల కిలోల ఉత్పత్తికి బోర్డు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు నాట్లు వేసి పంట పండించాలని అధికారులు రైతులకు సూచించారు. బోర్డు నిబంధనలను రైతులు పక్కన పెట్టి అధిక విస్తీర్ణంలో పంట సాగు చేపట్టారు. 2024–25 పంట కాలంలో ఎస్ఎల్ఎస్ ప్రాంతంలో సాగు విస్తీర్ణం 32 వేల నుంచి 35 వేల హెక్టార్లు ఉంటుందని అంచనా. ఉత్పత్తి కూడా 80 మిలియన్ల కిలోలు ఉంటుందని సమాచారం.

**కొత్త భూముల్లో సాగు**

ప్రతి ఏటా సాగు చేస్తున్న భూములతో పాటు కొత్త భూముల్లో రైతులు పంట సాగు


దేవరపల్లిలో వర్జీనియా పొగాకు సాగు

చేస్తున్నారు. జీడిమామిడి, కొబ్బరి, ఆయిల్ పామ్, మామిడి వంటి తోటలను తొలగించి పొగాకు నాట్లు వేస్తున్నారు. దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల్లో ఎక్కువగా జీడిమామిడి, కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటలను తొలగించారు. అధిక కౌలుకు భూములను తీసుకుని పంట వేస్తున్నారు. ఎకరం పొలం కౌలు రూ.70 నుంచి రూ.80 వేలు పలికింది. అయినా రైతులు పోటీపడి కౌలు భూములు తీసుకుని పొగాకు సాగు చేస్తున్నారు.

**బ్యారన్ ఖరీదు రూ.8 లక్షలు**

బ్యారన్ ఖరీదు రూ. 8 లక్షలకు చేరుకుంది. రెండేళ్ల కిందట బ్యారన్ ఖరీదు రూ. 2.50 లక్షలు ఉండగా, ఈ ఏడాది రూ. 8 లక్షలు పలికింది. పెద్ద రైతులు తమ బ్యారన్లను అమ్ముకుని సొమ్ము చేసుకుంటుండగా, చిన్న, సన్నకారు రైతులు కొనుగోలు చేస్తున్నారు. బ్యారన్ అద్దె రూ. 2.50 లక్షలు పలికింది. అయినప్పటికి రైతులు ధీమాగా భూముల కౌలు, బ్యారన్ల అద్దెకు తీసుకుని పంట సాగు చేస్తున్నారు.

**18,149 హెక్టార్లలో నాట్లు**

పొగాకు బోర్డు రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెంలోని రెండు వేలం కేంద్రాల పరిధిలో ఇప్పటి వరకూ 18,149 హెక్టార్లలో పొగాకు నాట్లు వేశారు. మరో రెండు వారాల్లో దాదాపు నాట్లు వేయడం పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు. 2023–24 పంట కాలంలో బోర్డు 19,971 హెక్టార్లలో పంట సాగుకు అనుమతి ఇవ్వగా, 24,776 హెక్టార్లలో సాగు చేశారు.

**వేలం కేంద్రాల వారీగా సాగు విస్తీర్ణం**

| వేలం కేంద్రం | సాగు విస్తీర్ణం 2023–24 (హెక్టార్లు) | ప్రస్తుతం వేసిన నాట్లు 2024–25 (హెక్టార్లు) |
|---|---|---|
| దేవరపల్లి | 4042.13 | 3014.01 |
| జంగారెడ్డిగూడెం–1 | 5153.00 | 3883.15 |
| జంగారెడ్డిగూడెం–2 | 5407.04 | 3038.78 |
| కొయ్యలగూడెం | 5375.00 | 4190.72 |
| గోపాలపురం | 4799.20 | 4023.00 |

**జాగ్రత్తలు తీసుకోవాలి**



ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో పొగాకు సాగు రైతులు జాగ్రత్తలు పాటించాలి. ప్రధాన పొలంలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. పంటపై తెగుళ్ల ఆశించకుండా ముందుగా కాపర్ ఆక్సిక్లోరైడ్ (బ్లెటాక్స్)ను పిచికారీ చేయాలి. ప్రధాన పొలంలో ఎరువులు వేయడం, నీరు పెట్టడం వాయిదా వేసుకోవాలి. రెండు రోజుల్లో ఎరువులు వేసినట్లయితే అధిక వర్షాలకు మొక్కకు అందవు కాబట్టి వర్షాలు ఆగిన తర్వాత అదును చూసుకుని మరలా వేసుకోవాలి. జిల్లాలో వాతావరణం అనుకూలించడంతో చాలామంది నాట్లు సకాలంలో వేశారు.

– జీఎల్‌కే ప్రసాద్, రీజినల్ మేనేజర్, పొగాకు బోర్డు, రాజమహేంద్రవరం

## రాజమహేంద్రవరం టు ముంబయి

- ఎయిర్ బస్ ప్రారంభం
- 120 మంది ప్రయాణికులతో సర్వీస్


ఇండిగో విమాన సర్వీసు

మధురపూడి: ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న రాజమహేంద్రవరం టు ముంబయి ఎయిర్ బస్ ప్రారంభమైంది. రాజమహేంద్రవరం సమీపంలోని మధురపూడి ఎయిర్ పోర్టు నుంచి 120 మంది ప్రయాణికులతో మొదటి సర్వీసును ఆదివారం రాత్రి 7.15 గంటలకు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ రాజమహేంద్రవరం నుంచి ముంబయికి, ముంబయి నుంచి రాజమహేంద్రవరానికి నేరుగా ఇండిగో విమాన సర్వీసులు ప్రారంభించిందన్నారు. మొదటి సర్వీసు ముంబయి నుంచి సాయంత్రం 4.50 గంటలకు బయలుదేరి 6.45 గంటలకు రాజమహేంద్రవరం (మధురపూడి) చేరుకుందన్నారు. ఇక్కడి నుంచి రాత్రి 7.15 గంటలకు బయలుదేరి ముంబయి 9.05 గంటలకు చేరుకుంటుందన్నారు. ఇరు నగరాల మధ్య ప్రయాణానికి 1.50 గంటల వ్యవధి పడుతుందన్నారు. ముంబయి నుంచి వచ్చిన సర్వీసులో 172 మంది ప్రయాణికులు ప్రయాణం చేయగా, ఇక్కడి నుంచి 120 మంది ముంబయికి వెళ్లారన్నారు. ముంబయి నుంచి ఇక్కడకు వచ్చిన విమానానికి పైపుల ద్వారా నీటిని వెదజల్లుతూ స్వాగతం పలికారు. అదేవిధంగా ఈ నెల 12 నుంచి న్యూ ఢిల్లీకి కూడా ఇక్కడ నుంచి నేరుగా ఎయిర్ బస్సు ప్రారంభమవుతాయని జ్ఞానేశ్వరరావు తెలిపారు. ఆ రోజు న్యూఢిల్లీలో ఉదయం 7.30 గంటలకు బయలు దేరి మధురపూడికి 9.45 గంటలకు చేరుకుంటుంది. ఇక్కడి నుంచి 10.30 గంటలకు బయలుదేరి, మధ్యాహ్నం ఒంటి గంటకు న్యూఢిల్లీ చేరుకుంటుందన్నారు. రెండు నగరాల మధ్య 2.15 గంటల వ్యవధిలో ప్రయాణం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో విమానయాన శాఖ అధికారులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక గోదావరి రైల్వే స్టేషన్‌లో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి (55) రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడని రాజమహేంద్రవరం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ లోవరాజు తెలిపారు. అతని మృతదేహం స్థానిక ప్రభుత్వాసుపత్రి మార్చురీలో ఉందన్నారు. మృతుడి ఒంటిపై నీలం రంగు షర్ట్, నలుపు రంగు ఫ్యాంట్ ఉందన్నారు. పై గుర్తు తెలియని వ్యక్తి గురించి ఏదైనా సమాచారం ఉంటే జీఆర్పీ 94406 27551, 94914 44022 నంబర్లకు తెలపాలన్నారు.

## అప్పనపల్లిలో భక్తుల కోలాహలం

మామిడికుదురు: కలియుగ ప్రత్యక్ష దైవం అప్పనపల్లి శ్రీబాల బాలాజీస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. కార్తీక బహుళ అమావాస్య కావడంతో విశేష సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. పవిత్ర వైనతేయ గోదావరి నదీ తీరంలోని స్నానఘట్టం, కేశఖండన శాల, పాత, కొత్త ఆలయాలు, అన్న సమారాధన కేంద్రం కోలాహలంగా మారాయి. భారీ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. స్వామివారి సన్నిధిలో నిత్యం జరిగే శ్రీలక్ష్మీ నారాయణ హోమంలో పాల్గొన్నారు. గోశాలను సందర్శించి గోవులకు పూజలు చేశారు. కార్తీక మాసంలో నెల రోజులు స్వామివారికి రికార్డు సంఖ్యలో రూ.57,45,465 ఆదాయం లభించిందని ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. 2,28,360 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారని, 1,01,280 మంది స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారన్నారు. గత ఏడాది కంటే ఇప్పుడు 81,710 మంది అధికంగా స్వామి వారిని దర్శించుకున్నారని, ఈ ఏడాది రూ.27,20,199 అధిక ఆదాయం లభించిందన్నారు. కొత్తపేట ఆర్డీఓ పి.శ్రీకర్, డి.అఖిల (రామచంద్రపురం ఆర్డీఓ) దంపతులు అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామిని దర్శించుకున్నారు. వీరికి అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. ఉభయ దేవేరులతో కొలువు తీరిన స్వామి వారిని దర్శించుకున్న అనంతరం అర్చకులు వారికి స్వామివారి ఆశీర్వచనం అందజేశారు.

# పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించాలి

**ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు డిమాండ్**

అమలాపురం టౌన్: రాష్ట్ర ప్రజలపై ఆర్థిక భారం మోపుతూ కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే ఉపసంహరించాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు డిమాండ్ చేశారు. అమలాపురంలోని తన క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులతో ఆదివారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడారు. ఎన్నికలకు ముందు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఎట్టి పరిస్థితుల్లోనూ కరెంట్ బిల్లులు పెంచేది లేదని హామీ ఇచ్చి, ఇప్పుడు మాట తప్పి చార్జీలు పెంచారని ధ్వజమెత్తారు. చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలకే దిక్కులేదని, ఇప్పుడు విద్యుత్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు

బిల్లుల పెంపు కూడా అయన మార్కు మోసమేనని ప్రజలు ఒక్కొక్కటిగా గ్రహిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. ట్రాన్స్‌మిషన్ చార్జీల పేరుతో విద్యుత్ బిల్లుల పెంపు అత్యంత దారుణంగా ఉండి సామాన్యులను ఆర్థికంగా నడ్డివిరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విండ్ విద్యుత్– సోలార్ విద్యుత్ మన రాష్ట్ర సముద్ర తీరం వెంబడి పుష్కలంగా ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నాలు మానేసి, ఎంతసేపూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వానికి ప్రతి విషయాన్ని ముడిపెట్టి మాట్లాడడం సరికాదని స్పష్టం చేశారు. విద్యుత్ చార్జీల పెంపు ఒప్పందాలను తక్షణమే రద్దు చేసుకోవాలని ఎమ్మెల్సీ డిమాండ్ చేశారు. చేసేది గోరంత... చెప్పేది చేటంత అనే చందంగా కూటమి ప్రభుత్వం, అనుకూల పచ్చ మీడియా విస్తృత ప్రచారానికే పెద్దపీట వేస్తున్నాయే తప్ప ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మాత్రం గాలికి వదిలేశారని ఆయన ధ్వజమెత్తారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ లీగల్ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు కుడుపూడి త్రినాథ్ తదితరులు పాల్గొని పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు.


## చెట్టు నుంచి పడి గాయాలు


చికిత్స పొందుతున్న వీరబాబు

తొండంగి: చెట్టు పైనుంచి జారిపడి కల్లు గీత కార్మికుడు తీవ్ర గాయాల పాలైన సంఘటన కొమ్మనాపల్లిలో శనివారం చోటు చేసుకుంది. కొమ్మనాపల్లి గ్రామానికి చెందిన పెంకే వీరబాబు కల్లు గీత కార్మికుడిగా ఉంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శనివారం ఉదయం యథావిధిగా గ్రామ శివారులోని తాడిచెట్టు ఎక్కి జారిపడ్డాడు. తీవ్ర గాయాలతో ఉన్న అతడిని సమీపంలోని తోటి కార్మికుడు తోలెం అప్పారావు తదితరులు అంబులెన్స్‌లో ఎక్కించి కాకినాడ సమీపంలో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. క్షతగాత్రుడిని ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘ కాకినాడ జిల్లా కన్వీనర్ బత్తిన నాగేశ్వరరావు పరామర్శించారు.

# అయినవిల్లి... ఆధ్యాత్మికతతో శోభిల్లి

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వర స్వామివారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకం, ఏకాదశ, లఘున్యాస, రుద్రాభిషేకాలు, వివిధ ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి మహానివేదన అనంతరం వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారి లఘున్యాస, ఏకాదశ రుద్రాభిషేకాల్లో 40 మంది, పంచామృతాభిషేకాల్లో నలుగురు దంపతులు, లక్ష్మీగణపతి హోమంలో 11 మంది పాల్గొన్నారు. ఆరుగురు నూతన వాహన పూజలు చేయించుకోగా అన్నదాన పథకంలో 5,420 మంది స్వామి ప్రసాదం స్వీకరించారు. ఆలయానికి వివిధ పూజలు, అన్నదాన విరాళాలుగా రూ.2,26,694 ఆదాయం లభించిందని ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి అమలాపురానికి చెందిన దువ్వూరి లక్ష్మీఉదయ, రామభాస్కర కుమారి కుటుంబ సభ్యులు రూ.16,816 విరాళంగా సమర్పించారు.


అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారు


దాత లక్ష్మీఉదయ, రామ భాస్కరకుమారిలకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

**కార్తీకంలో రూ.83.77 లక్షల ఆదాయం**

ఈ కార్తీక మాసంలో అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారి దేవస్థానానికి రూ.82,77,303 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ సత్యనారాయణరాజు తెలిపారు. ఈ నెల రోజుల్లో సుమారు 2,76,000 మంది భక్తులు వచ్చారన్నారు. స్వామివారి అన్న ప్రసాదాన్ని 1,26,000 స్వీకరించారని వివరించారు. గత ఏడాది కంటే ప్రస్తుతం 1.20 లక్షల మంది అధికంగా భక్తులు రాగా, రూ.37,63,985 ఆదాయం అధికంగా వచ్చిందన్నారు.

# రత్నగిరిపై ముగిసిన కార్తీక సందడి

- తొలి రోజు నుంచీ భక్తుల రద్దీ
- సుమారు 20 లక్షల మంది రాక
- రికార్డు స్థాయిలో సత్యదేవుని వ్రతాలు

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని సన్నిధిలో కార్తీక మాస సందడి ఆదివారంతో ముగిసింది. 31 రోజుల పాటు భక్తులతో సత్యదేవుని ఆలయం, ప్రాంగణం, వ్రత మండపాలు, విశ్రాంతి మండపాలు ప్రత్యేక కళను సంతరించుకున్నాయి. కార్తీక శని, ఆది, సోమవారాలు, దశమి, ఏకాదశి, పౌర్ణమి వంటి పర్వదినాల్లో 80 వేల నుంచి లక్షకు పైగా భక్తులు సత్యదేవుని దర్శించారు. గత నెల 15న కార్తీక పౌర్ణమి నాడు సత్యదేవునిని సుమారు లక్ష మంది భక్తులు, 25న నాలుగో సోమవారం అత్యధికంగా 1.20 లక్షల మంది భక్తులు దర్శించుకున్నారు.

**సత్ఫలితాలిచ్చిన కంపార్ట్‌మెంట్ విధానం**

లక్షలాదిగా తరలివచ్చిన భక్తుల కోసం దేవస్థానంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా పశ్చిమ రాజగోపురం ముందు భక్తులను నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన కంపార్ట్‌మెంట్లు సత్ఫలితాలిచ్చాయి. ఆరు కంపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేసి ఒక్కో దాంట్లో వెయ్యి మంది చొప్పున భక్తులను ఉంచి క్యూ లైన్ ఖాళీ అయిన వెంటనే అందులోకి పంపించేవారు. ఈ విధానంతో తోపులాట లేకుండా సజావుగా సాగింది.

**భక్తుల కోలాహలమే..**

కార్తీక మాసంలో సుమారు 20 లక్షల మంది భక్తులు సత్యదేవుని దర్శించారని అధికారుల అంచనా. ఈ సారి దశమి, ఏకాదశి, పౌర్ణమి వంటి తిథులు తగులు,


సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు


స్వామివారి దర్శనానికి క్యూలో భక్తులు

మిగులు రావడంతో భక్తులు రెండు రోజులు కూడా పవిత్రంగా భావించి స్వామివారిని దర్శించుకున్నారు. గతంలో ఒకేరోజు ఈ తిథులు రావడంతో భక్తులు పోటెత్తేవారు. దీంతో దేవస్థానం సిబ్బంది కంట్రోల్ చేయడానికి ఇబ్బంది పడేవారు. ఈ సారి భక్తులు రెండ్రోజులు రావడంతో వారిపై ఒత్తిడి తగ్గింది.

**వ్రతాలు ఆచరించి..**

గత కార్తీకమాసంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది 1,47,122 వ్రతాలు జరిగాయి. గతేడాది కేవలం 1,28,832 మాత్రమే జరగగా, 2022లో 1,42,378 వ్రతాలు జరిగాయి. అంటే ఈ ఏడాది 2022 కన్నా సుమారు ఐదు వేలు, గతేడాది కన్నా 18,190 వ్రతాలు పెరిగాయి.

**రికార్డు స్థాయిలో ప్రసాద విక్రయాలు**

ఈ ఏడాది ప్రసాదం అమ్మకాలు కూడా రికార్డు స్థాయిలో జరిగాయి. ప్యాకెట్ రూ.20 చొప్పున సుమారు 22 లక్షల ప్రసాదం ప్యాకెట్లు విక్రయించారు. ప్రసాదం తయారీ, ప్యాకింగ్ సిబ్బంది అహర్నిశలు కష్టపడి సాధారణ రోజుల్లో 70 వేల నుంచి లక్ష, పర్వదినాల్లో లక్ష నుంచి రెండు లక్షల వరకూ ప్రసాదం ప్యాకెట్లు తయారు చేశారు.

**రూ.22 కోట్లకు పైగా ఆదాయం**

ఈ కార్తీకంలో రూ.22 కోట్లకు పైగా ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. గతేడాది కూడా రూ. 20 కోట్లు ఆదాయం వచ్చింది. వాస్తవానికి ఏటా కార్తీక మాసంలో ఆదాయం పెరుగుతోంది. ఈ ఏడాది వాతావరణం కూడా సహకరించడంతో భక్తుల రాక ఊహించిన దానికన్నా ఎక్కువగా రావడంతో ఆదాయం పెరగనుందని భావిస్తున్నారు.

**నేడు రెండో విడత హుండీల లెక్కింపు**

కార్తీకంలో రెండో విడత హుండీల ఆదాయం లెక్కింపు దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వి.త్రినాథరావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్నారు. తొలి విడతగా నవంబర్ 19న హుండీ కానుకల లెక్కింపు ద్వారా రూ.1.73 కోట్ల ఆదాయం వచ్చింది. రెండో విడత లెక్కింపులో మరో రూ.రెండు కోట్లు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దేవస్థానం ట్రాన్స్‌పోర్టు బస్సుల నిర్వహణ ద్వారా దేవస్థానానికి రూ.41 లక్షలు ఆదాయం వచ్చింది. కార్తీక మాసం సందర్భంగా ఏర్పాట్లను అధికారులతో పాటు దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ పర్యవేక్షించారు.